# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ, మార్చి 17 : నాగార్జునసాగర్ ఆయకట్టు కింద బోరుబావుల ఆధారంగా వరి సాగు చేసి పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో ఎడమ కాల్వ ఆయకట్టు కింద బోరుబావుల ఆధారంగా సాగుచేసి ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టి యాసంగి వరి సాగు చేశారని, బోరుబావుల్లో నీరు దొరక్క పొట్ట దశలో పొలాలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను వ్యవసాయశాఖ ద్వారా సేకరించి నష్టం జరిగిన రైతులకు ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని కోరారు. రైతులకు పంట నష్టపరిహారాన్ని అందించేందుకు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ చూపి రైతులకు తగు న్యాయం చేయాలని కోరారు. కాగా యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన సైదులు ఐదెకరాలు, బంటు లక్ష్మయ్య నాలుగు ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో నిప్పు పెట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, రైతులు పాల్గొన్నారు.



వరి పొలానికి నిప్పు పెట్టిన రైతు సైదులు



ఆత్మకూర్(ఎస్)మండలం రామన్నగూడెంలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని అసమర్థ ప్రభుత్వం

- రైతులకు నష్టం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఆత్మకూర్.ఎస్, మార్చి 17 : నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పాలకుల అసమర్థతతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని రామన్నగూడెం, రామోజీతండాలో ఆదివారం నీళ్లు లేక ఎండిపోతున్న వరి పొలాలు, మిరప తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్ల కరువు రావడంతో మళ్లీ బావులు తవ్వుకోవాల్సి వస్తున్నదని, కొత్తగా బోర్లు వేసుకుంటున్నారని అన్నారు. ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు 50వేల నష్ట పరిహారం, మిరప తోటలకు 80వేల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో నీళ్లు ఉన్నా ఎత్తి పోయకుండా నాటి బీఆర్‌ఎస్ సర్కారును అప్రతిష్ట పాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని, ప్రజల కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇదే సమయానికి చెరువులు, కుంటలు జల కళలాడుతున్నాయని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వెలవెల బోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండాకాలంలోనూ చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్ సర్కారుదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని, రైతులను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. అనంతరం రామన్నగూడెంలో నూతనంగా నిర్మించిన కంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బొల్లె జానయ్య, బత్తుల ప్రసాద్, కసగాని బ్రహ్మం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలూనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

# కుమ్మరులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే బాలూనాయక్‌కు కుమ్మరి సంఘం వినతి

కొండమల్లేపల్లి, మార్చి 17 : కుమ్మరులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నియోజకవర్గ కుమ్మ రి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 75 ఏండ్లుగా కుమ్మరులకు ఏనాడూ చట్టసభల్లో చోటు దక్కలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయి, రాము, వెంకటేశ్వర్లు, సైదులు, యాదగిరి, శంకర్, వెంకటయ్య, శ్రీను, మల్లేశ్, తిరుపతయ్య, యాదయ్య, దామోదర్, జంగయ్య, సైదులు పాల్గొన్నారు.

# బత్తాయి రైతులు సంఘటితం కావాలి

- ఉద్యానవన శాఖ ఏడీ సంగీతలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న సంగీతలక్ష్మి



హాజరైన రైతులు

నల్లగొండ సిటీ, మార్చి 17 : బత్తాయి రైతులు సంఘటితం కావాలని ఉద్యానవన శాఖ ఏడీ సంగీతలక్ష్మి సూచించారు.ఆదివారం పట్టణంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నామిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బత్తాయి రైతుల సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బత్తాయి డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర రావాల్సి ఉండడంతో దానిపై చర్చ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిపై రైతులంతా సంఘటితమై ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంహిత క్రాప్ కేర్ క్లినిక్ సీఈఓ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు నిపుణుల సూచనలు పాటించి నాణ్యమైన పంటలు పండిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వాలు రైతులకు ఫర్టిలైజర్‌ను సబ్సిడీ కింద అందిస్తే మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులతో తోటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, రైతులు నిరాశ చెంది తోటలను తొలగించవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన బత్తాయి మొక్కలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిరేకల్ డివిజన్ ఉద్యానవన అధికారి రావుల విద్యాసాగర్ మాట్లాడుతూ రైతుల సంఘటితంతో కట్టంగూర్ ఎఫ్‌పీఓ విజయవంతంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, శాస్త్రవేత్తలు సురేశ్‌రెడ్డి, రాజుగౌడ్, నెటాఫిన్ డ్రిఫ్ సౌత్ ఇండియా హెడ్ సుబ్బారావు, రైతులు అంజిరెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, అరవిందరావు, సంధ్య, శ్వేత, అన్నపూర్ణ, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మిర్యాలగూడ, మార్చి 17 : కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శీతాకాలపు ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు ఆదివారం యాద్గార్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వీధుల్లో కంపచెట్లను తొలగించి రోడ్లను శుభ్రం చేశారు. డ్రైనేజీలను శుభ్రం చేశారు. పాఠశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. మహాత్మాగాంధీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ విభాగం జూనియర్ అసిస్టెంట్ రామరాజు హరికిషన్‌రావు మాట్లాడుతూ.. గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న వలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోటయ్య, వలంటీర్లు, పాల్గొన్నారు.

# తాగునీటి వృథాకు చెక్ పడేనా?



శాలిగౌరారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదురుగా మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ లీకై కొద్ది రోజులుగా నీరంతా వృథా అవుతున్నది. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నీటి వృథాతో మంచినీళ్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–శాలిగౌరారం, మార్చి 17

# కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు అన్యాయం

- బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్



జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మార్చి 17 : కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందనుకుంటే అందుకు విరుద్ధంగా బీసీలకు అన్యాయమే జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 37 కార్పొరేషన్ చైర్మన్లలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 13 కార్పొరేషన్ చైర్మన్లు మాత్రమే కేటాయించి అగ్రకులాలకు 17 కేటాయించారని ఆరోపించారు. ఒక కులానికి మాత్రమే పదవులు ఇస్తే ప్రజాపాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఒంటెద్దు పోకడలను మానాలని, లేనిపక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మూల్యం తప్పదని హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్టు కుట్రపూరితం

- బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు బుచ్చమ్మ

కట్టంగూర్, మార్చి 17 : ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం కుట్రపూరితమని బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు గాజుల బుచ్చమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరైన సాక్ష్యాలుంటే అసెంబ్లీ ఎన్నికల ముందు ఎందుకు అరెస్టు చేయలేదని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ కుట్రలు పన్నిందని ఆరోపించారు. బతుకమ్మ పండుగకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన కవితను అరెస్టు చేయడం కక్షపూరితమని పేర్కొన్నారు. ఎప్పటికైనా కవిత నిర్దోషిగా బయటకు రావడం ఖాయమని తెలిపారు.

# నేటి నుంచి రామలింగేశ్వరుడి కల్యాణోత్సవాలు

నేరేడుగొమ్ము(చందంపేట), మార్చి 17 : నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నేటి నుంచి 21వ తేదీ వరకు రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి గణేశ్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18న గుట్టపైకి స్వామివారి ప్రవేశం, రుద్రాభిషేకం, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, 19న రుద్రాభిషేకం, 20న సాంస్కృతిక కార్యక్రమాలు, 21 కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్థిక సాయం

మునుగోడు, మార్చి17 : మండలం కేంద్రానికి చెందిన చెరుపల్లి గిరీశ్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తన పదో తరగతి స్నేహితులు ఆదివారం గిరీశ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించి రూ.55 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శివాజీరాజ్, మహేశ్, నితీశ్, చందర్, ప్రేమ్‌చంద్, భాస్కర్, అనిల్, కిశోర్ పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లికి చెందిన చిలుముల నరేశ్‌ది నిరుపేద కుటుంబం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదల ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక కోచింగ్ డబ్బులు లేక నకిరేకల్‌కు చెందిన బీజీఆర్ ఫౌండేషన్‌ను ఆర్థిక సాయం కోరారు. స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు కోచింగ్ నిమిత్తం ఆదివారం రూ.10 వేలు అందజేశారు.

# శాలిగౌరారంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు శశాంక్

శాలిగౌరారం, మార్చి 17 : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండకు చెందిన ఐకాన్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన వారు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు శశాంక్ ఆధ్వర్యంలోని వైద్య బృందం 300 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ శంభులింగారెడ్డి, ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాస్, కార్యదర్శి బచ్చు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, వెంకన్న, రామ్మూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నకిరేకల్, మార్చి 17 : పట్టణంలోని ఎస్పీఆర్ పాఠశాలలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముసుకు రవీందర్, పాఠశాల కరస్పాండెంట్ కన్నయ్యగౌడ్, చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- కాంగ్రెస్ ఆదివాసీ కమిటీ జిల్లా చైర్మన్ నాగేశ్వర్‌నాయక్

చందంపేట, మార్చి 17 : గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చందంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ ఆదివాసీ కమిటీ జిల్లా చైర్మన్ కేతావత్ నాగేశ్వర్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో అత్యధికంగా గిరిజన తండాలు ఉన్నాయని, ఆయా తండాల్లో సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే సహకారంతో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే బాలూనాయక్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, బెల్లయ్యానాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఏఏ చట్టం అమలుకు పూనుకోవడం సిగ్గుచేటు

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య



గ్రామస్తులకు సభ్యత్వాలు అందజేస్తున్న ఐలయ్య

మాడ్గులపల్లి, మార్చి 17 : రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సీఏఏ చట్టం అమలుకు పూనుకోవడం సిగ్గు చేటని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కుక్కడంలో ప్రజలకు ప్రజా సంఘాల సభ్యత్వాన్ని అందించి మాట్లాడారు. దేశంలోని ప్రజల మధ్య మతపరమైన చిచ్చు పెట్టేందుకే బీజేపీ సీఏఏ చట్టం తీసుకొచ్చిందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బుజ్జ చినవెంకులు, రొండి శ్రీనివాసులు, బొంగరాల వెంకటయ్య, ఎల్లయ్య, నారాయణరెడ్డి, లక్ష్మి, విజయ, రాములమ్మ, లక్ష్మమ్మ, ముత్యాలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

కట్టంగూర్, మార్చి 17 : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య సూచించారు. ఆదివారం కట్టంగూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మండల టాపర్లుగా నిలిచిన ముగ్గురికి ప్రథమ రూ.5,116, ద్వితీయ రూ.3,116, తృతీయ బహుమతి రూ.2,116 నగదు బహుమతులు, 12 పాఠశాలల్లో టాపర్‌గా నిలిచిన ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండలాధ్యక్షుడు బుస్సి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి దేశపాక కృష్ణ, శ్రీనివాస్‌రావు, కొంద్ర నాగలక్ష్మి పాల్గొన్నారు.

# త్రిపురారం మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు

త్రిపురారం, మార్చి 17 : నేటి నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నందున మండల పరిధిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బాలాజీనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 394 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సెల్‌ఫోన్ వాడకుండా నిషేధం ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఆ సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాల్సి ఉంటుందని తెలిపారు.

# రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు





పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో రాజకీయ నాయకుల విగ్రహాలు, దిమ్మెలు, చిహ్నాలను మూసివేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పలు విగ్రహాలకు మున్సిపల్ సిబ్బంది ముసుగులు వేస్తున్న దృశ్యాలివి.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తేతెలంగాణ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**కావలెను**

TS RTC కోదాడ మరియు మిర్యాలగూడ డిపోలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్ మరియు వెల్డర్ కావలెను. అర్హత టెన్త్ క్లాస్ మరియు ఐటిఐ, జీతం+EPF and ESI కలదు. Cell: 7730805327.

NLG-

**FLAT FOR SALE**

★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.

NT-327957

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626
నల్లగొండ : 9182777635
దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059

TMB తమిళ్‌నాడ్ మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్

డో.నెం.19-82, రెడ్డి కాలనీ, గ్రౌండ్ ఫ్లోర్, ఫస్టుఫేజ్, సాగర్ రోడ్, మిర్యాలగూడ-508 207, నల్లగొండ జిల్లా. (టి.ఎస్

**బంగారు నగల వేలము ప్రకటన**

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా బ్యాంకు శాఖ నందు బంగారునగలు తాకట్టుపెట్టి ఋణము తీసుకొని ఉన్నారు. ఈ బంగారు ఋణము NPA అయినందున ఇందుమూలముగా బహిరంగ ప్రకటన చేయటమేమనగా, ఈ క్రింది ఖాతాదారుని బంగారు నగలను తేది:28.03.2024 గురువారం సాయంత్రం గం.4.00లకు మా బ్రాంచి ఆఫీసు ఆవరణ యందు బహిరంగ వేలం వేసి వారి పేరున/వారికి సంబంధించి ఉన్న బకాయిలకు జమకట్టుకొనబడును. షరతులు: 1) వేలంలో పాల్గొనదలచినవారు 28-03-2024 మధ్యాహ్నం 1 గంటలోపు పేరు నమోదు చేయించుకోవలెను. 2) ఎట్టి కారణము చూపకనే వేలం ఆఫర్ తిరస్కరించుటకుగాని, వేలం ఆపివేయుటకు గాని, వాయిదా వేయుటకుగాని బ్యాంకు వారికి పూర్తి అధికారములు కలవు 3) వేలం వేసినా బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. 4) ఈ వేలం ప్రకటన తదితర ఖర్చులు ఈ క్రింది ఖాతాదారులే భరించవలెను.

| క్ర. సంఖ్య | ఖాతా నెం | ఖాతాదారుని పూర్తి పేరు మరియు చిరునామ | బంగారం గ్రాములలో |
| --- | --- | --- | --- |
| 1 | 358700300116571 | మాలోతు భారతీ, W/o.మాలోతు బిక్షపతి, నెం.19-662/A, ముత్తిరెడ్డికుంట, మిర్యాలగూడ, లోన్ అమౌంట్:45000/- | గోల్డ్ గ్రాస్ వెయిట్ 14.50 గ్రాములు గోల్డ్ నెట్ వెయిట్ 10.00 గ్రాములు |

తేది: 17-03-2024, స్థలం: మిర్యాలగూడ,
సం/- బ్రాంచి మేనేజర్